# ఉల్లి సాగుపై దృష్టి సారించిన రైతులు

- నియోజకవర్గంలో 4 వేల ఎకరాల్లో సాగు
- ఎకరాకు రూ.70 వేలకుపైనే పెట్టుబడులు
- ధరలు నిలకడగా ఉంటే ఆదాయం


వేల్పుల వద్ద డ్రిప్ ద్వారా సాగు చేసిన ఉల్లి

**వేముల :** ఖరీఫ్‌లో ఉల్లి సాగుపై రైతులు దృష్టి సారించారు. ఈ ఏడాది ఉల్లి సాగు విస్తీర్ణం కూడా పెరుగుతోంది. గత ఏడాది ధరలు ఉండటంతో రైతులు ఉల్లి సాగును ఎంచుకుంటున్నారు. ఉల్లి సాగుకు పెట్టుబడులు అవుతున్నా రైతులు సాగుకు వెనుకాడటంలేదు. ఉద్యాన పంటలలో అతి సున్నితమైన పంట ఉల్లి. పంటను జాగ్రత్తగా కాపాడుకుంటే తప్ప ఏమాత్రం నిర్లక్ష్యం చేసినా రైతులు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తోంది. దీంతోనే రైతులు ఉల్లి పంటను జాగ్రత్తగా కాపాడుకుంటున్నారు. పంటకు ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవడంతోపాటు సకాలంలో సస్యరక్షణ చర్యలు చేపడతారు.

**నియోజకవర్గంలో 4 వేల ఎకరాలలో సాగు**

ఈ ఏడాది ఉల్లి సాగు కూడా పెరిగింది. పులివెందుల నియోజకవర్గంలో 4 వేల ఎకరాలలో ఉల్లి సాగవుతుందని ఉద్యాన శాఖ అధికారులు చెబుతున్నారు. గత ఏడాది ధరలు ఉండటంతో ఆదాయం వచ్చింది. దీంతో ఎక్కువ మంది ఉల్లి సాగును ఎంచుకున్నారు. కొన్ని గ్రామాల్లో కొంతమంది రైతులు ఉల్లి సాగులో నష్టం వచ్చినా. ఆదాయం వచ్చినా ఉల్లి సాగును మాత్రం మరిచిపోరు. తనకున్న పొలంలో కనీసం 2 ఎకరాలలోనైనా ఉల్లి సాగు చేస్తారు. ఇతర పంటలు సాగు చేయడం ద్వారా ఆశించిన మేర ఆదాయం రావడంలేదు. సాగులో వచ్చిన ఆదాయం పెట్టుబడులకే సరిపోతోంది. దీంతో రైతులు ఉల్లి సాగు చేస్తే ధరలు ఉన్నట్లయితే పెట్టుబడులుపోనూ ఎకరాకు లక్ష రూపాయల వరకు ఆదాయం ఉంటుందని సాగుకు మొగ్గు చూపుతున్నారు.

**పెరిగిన ఉల్లి విత్తనాల ధరలు.. :**

ఈ ఏడాది ఉల్లి విత్తన ధరలు కూడా రెండింతలు పెరిగాయి. ఉల్లి సాగు విస్తీర్ణం పెరగడంతో ఉల్లి ధరలు కూడా పెంచేశారు. ఉల్లి విత్తనాలను కర్నూలు జిల్లాలోనే పత్తికొండ, రామళ్లకోట్ల, నన్నూరు, ఓసూరు, కోటపాడు తదితర ప్రాంతాలలో ఉల్లి విత్తనాలను కొనుగోలు చేసి తెచ్చి రైతులకు విక్రయిస్తున్నారు. గత ఏడాది చేరు ఉల్లి విత్తనాలు ఐదారు వందలు ఉండగా. ఈ ఏడాది ఏకంగా రూ.1000లకుపైనే ధరలు పలికాయి. గతనెల నుంచే రైతులు వ్యవసాయ బోర్లు, బావుల కింద ఉల్లి సాగును రైతులు ముమ్మరం చేశారు.

**ఎకరాకు రూ.70వేలకు పైనే పెట్టుబడులు**

ఎకరాకు రూ.70వేలకుపైనే పెట్టుబడులు అవుతున్నాయి. ఉల్లి సాగు మొదలు దిగుబడులు చేతికొచ్చే వరకు పెట్టుబడులు పెట్టాల్సి వస్తోంది. ఉల్లి పంట కాలం నాలుగు నెలలు. ఈ కాల వ్యవధిలో ఉల్లి పంటను కన్నబిడ్డల్లా చూసుకోవాల్సి ఉంటుంది. ఉల్లి పంటకు ఎక్కువగా తెగుళ్ల సోకుతుంటాయి. సకాలంలో తెగుళ్ల నివారణకు మందులు స్ప్రే చేయడం, నీటి తడులు, కలుపు తొలగించడం చేపట్టాలి. పంట దిగుబడులు వచ్చే సరికి కనీసం పదిసార్లు మందులు స్ప్రే చేయాల్సి ఉంటుంది. అంతేకాక రసాయనిక ఎరువుల వాడకం కూడా పెరుగుతోంది. దీంతోనే రైతులకు ఉల్లి సాగులో పెట్టుబడులు అవుతున్నాయి.


ఉల్లి విత్తనాలు చల్లి నీరు కడుతున్న రైతు

**ముందస్తు ఉల్లి సాగును ఎంచుకున్న రైతులు :**

ఉల్లి సాగును మామూలుగా జూన్ నెలలో సాగు చేస్తారు. అంతకముందు సాగుకు వాతావరణం అనుకూలంగా ఉండదు. మే నెలలో ఉష్ణోగ్రతలు పెరిగి ఎండలు అధికంగా ఉంటాయి. మే నెలలో ఉల్లి సాగు చేస్తే విత్తనం మొలకెత్తినా ఎండలకు ఉల్లి మొక్కలు చనిపోతాయి. దీంతో రైతులు జూన్ నెలలో సాగుకు సిద్ధమవుతారు. అయితే ఈ ఏడాది మే నెలలో వర్షాలు పడటంతో ఉష్ణోగ్రతలు తగ్గి ఎండలు కూడా లేవు. దీంతో మే నెల మొదటి వారం నుంచే కొంతమంది రైతులు ఉల్లి సాగు చేశారు. ఉల్లిని ముందస్తుగా సాగు చేస్తే మార్కెట్ ధరలు బాగా ఉంటాయనే ఉద్దేశ్యంతో రైతులు ఆ దిశగా సాగు చేశారు. గత ఏడాది ముందుగా దిగుబడులు వచ్చిన రైతుకు ధరలు ఉండటంతో ఆదాయం వచ్చింది. దిగుబడులు పూర్తిస్థాయిలో వచ్చే సరికి ధరలు తగ్గాయి.

**2ఎకరాలలో ఉల్లి సాగు**

నాకున్న 2 ఎకరాలలో ఉల్లి సాగు చేశా. సాగు చేసి నెలరోజులు కావస్తోంది. సాగుకు పెట్టుబడులు అధికమవుతున్నాయి. సాగులో ఆశించిన మేర దిగుబడులు వచ్చి ధరలు ఉంటే ఆదాయం ఉంటుంది. ధరలు తగ్గితే సాగులో నష్టపోతున్నాం.

– రాజారెడ్డి, ఉల్లి రైతు, గొందిపల్లె



**సాగులో ఆదాయం ఉంటుందనే**

ఉల్లి పంటలో ఆదాయం ఉంటుందని సాగు చేశాం. సాగుకు పెట్టుబడులు అవుతున్నా ఉల్లి పంట వేస్తున్నాం. పంటలో అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నాం. సాగులో దిగుబడులు వచ్చి ధరలు ఉంటాయనే ఆశతో సాగు చేశాం.

– ఎల్.రామగంగిరెడ్డి, ఉల్లి రైతు, నారేపల్లె



## క్లుప్తంగా

### భూసార పరీక్షలు తప్పనిసరి

**పెద్దముడియం :** రైతులు భూసార పరీక్షలు తప్పనిసరిగా చేయించాలని శాస్త్రవేత్తలు బాలకృష్ణ, కె.వి.కె. అధిపతి, కె.సుబ్బరాయుడు తెలిపారు. మండలంలోని పెద్దపసుపుల, పాలూరు, చిన్నపసుపుల, పెద్దముడియం, ఉలవపల్లె, బి.టి.పాడు.గుండ్లకుంట గ్రామాలలో మేలైన విత్తన రకాలు, భూసార పరిరక్షణ, చిరుధాన్యాల ఆవశ్యకతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. భూసార పరీక్షలు చేయడం వలన అనేక ప్రయోజనాలు ఉన్నాయని, పెట్టుబడి ఖర్చులు తగ్గడంతో పాటు నాణ్యమైన దిగుబడులు వస్తాయని తెలిపారు. కార్యక్రమంలో వీవీఏలు, వీహెచ్ఏలు, రైతులు పాల్గొన్నారు.

### నేలకొరిగిన అరటి పంట


నేలకొరిగిన అరటి పంటను చూపుతున్న గురిజాల రైతు

**సింహాద్రిపురం :** మండలంలోని గురిజాల, తదితర గ్రామాలలో మంగళవారం సాయంత్రం వీచిన ఈదురు గాలులకు అరటి పంట నేలకొరిగింది. గురజాల గ్రామంలోని నాగరాజారెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, చిన్న కుళాయిరెడ్డి, నాగార్జునరెడ్డి, విజయవర్ధన్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, తదితర రైతుల అరటి పంటలు నేలకొరిగి తీవ్రంగా నష్టపోయారు. బుధవారం ఆర్ఎస్ఏ సిబ్బంది వచ్చి నేలకూలిన అరటి పంటలను పరిశీలించి నివేదికలు ప్రభుత్వానికి పంపుతామని రైతులకు తెలిపారు. నష్టపోయిన రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించి రైతులను ఆదుకోవాలని వారు వేడుకుంటున్నారు.

### బాలుడిని తల్లిదండ్రులకు అప్పగించిన పోలీసులు


బాలుడిని తల్లిదండ్రులకు అప్పగిస్తున్న పోలీసులు

**పులివెందుల రూరల్ :** పట్టణంలో నివాసం ఉంటున్న సుబ్బరాయుడు, అక్షరల కుమారుడు డేరంగుల గగన్(7) మానసిక వికలాంగుడు. బుధవారం ఇంటి నుంచి పోయి బజాజ్ షోరూం ప్రాంతాల్లో తిరుగుతుండటంతో స్థానికులు గుర్తించి పోలీసులకు అప్పగించారు. పోలీసులు బాలుడు ఉన్న ప్రాంతాల్లో విచారించగా సుబ్బరాయుడు, అక్షరల కుమారుడు అని తెలియడంతో వారిని పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి ఆ బాలుడిని తల్లిదండ్రులకు అప్పగించారు.

### దోమల నివారణకు ఏసీఎం పిచికారి


హాస్టల్‌లో మందును పిచికారి చేయిస్తున్న సిద్దయ్య

**వేంపల్లె :** దోమల నివారణకు ఏసీఎం మందును పిచికారి చేయాలని మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ సిద్దయ్య తెలిపారు. బుధవారం వేంపల్లెలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, ప్రభుత్వ బాలుర, బాలికల వసతి గృహాల్లో మలేరియా సబ్ యూనిట్ అధికారి సిద్దయ్య ఆధ్వర్యంలో దోమల నివారణకు ఆల్ఫాసైపర్ మిత్రిన్ మందును పిచికారి చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మలేరియా నివారణ మాసోత్సవాలు సందర్భంగా దోమల నివారణకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఏసీఎం మందును పిచికారి చేసిన ప్రదేశంలో దోమ వాలితే నిమిషాల్లో చనిపోతుందన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

### రాష్ట్రంలో దళిత మహిళలకు రక్షణ లేకుండా పోయింది

**జమ్మలమడుగు :** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత దళితుల మాన ప్రాణాలకు రక్షణ లేకుండా పోయిందని వైఎస్సార్‌సీపీ దళిత నాయకులు రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి యోబు, మున్సిపల్ వైస్ చైర్మన్ సింగరయ్యలు తెలిపారు. పాతబస్టాండ్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిర్వహించిన నిరసన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ రాష్ట్రంలో దళిత బాలికలపై అత్యాచారాలు చేసి చంపుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడంలేదన్నారు. ఇటీవల ఏ కంబాలదిన్నె గ్రామంలో మూడు సంవత్సరాల చిన్నారిపై అత్యాచారం చేసి చంపడం, అనంతపురం జిల్లాలో దళిత యువతిని బీరు సిసాలతో కొట్టి పెట్రోల్ పోసి కాల్చి చంపారన్నారు. ఈ కార్యక్రమంలో 10వ వార్డు ఇన్‌చార్జి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

### ఆటో డ్రైవరుకు తీవ్ర గాయాలు

**చింతకొమ్మదిన్నె :** లింగారెడ్డిపల్లె సమీపంలో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్ నాగ ప్రసాద్‌కు తీవ్ర గాయలయ్యాయి. రాయచోటి వెళ్తున్న ఆటో కల్యాణ మండపం సమీపంలోకి రాగానే ఎదురుగా వస్తున్న గుర్తుతెలియని వాహనం ఢీ కొనడంతో ఆటో అదుపుతప్పి టమోటా లోడుతో వస్తున్న మినీ లారీ ఢీ కొంది. రాజులతాతయ్యగారిపల్లెకు చెందిన ఆటో డ్రైవర్‌కు తీవ్రగాయాలు అయ్యాయి.

## కమలాపురం సీడీపీఓగా శ్రీలత


సీడీపీఓగా బాధ్యతలు చేపట్టిన శ్రీలత

**కమలాపురం :** కమలాపురం ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీపీఓగా శ్రీలత బాధ్యతలు చేపట్టారు. సాధారణ బదిలీలో భాగంగా బుధవారం పులివెందులలో పనిచేస్తున్న ఆమె కమలాపురంకు వచ్చారు. ఇక్కడ సీడీపీఓగా పని చేస్తున్న సుజామణి గత నెలలో పదవీ విరమణ చేశారు. కాగా బాధ్యతలు చేపట్టిన శ్రీలత కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రాజెక్ట్ పరిధిలోని అంగన్‌వాడీ వర్కర్లు సమయ పాలన పాటించాలన్నారు. చిన్నారులకు షెడ్యూల్ ప్రకారం పౌష్టికాహారం అందించడంతో పాటు వారికి అక్షరాలు, పదాలు నేర్పించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రతి రోజు పౌష్టికాహారం వడ్డించాలన్నారు. గర్భిణులు, బాలింతలు, కిషోర బాలికలు, రక్త హీనత ఉన్న వారిపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. అలాగే ఆశా, వైద్య ఆరోగ్య సిబ్బందితో కలసి చిన్నారులు, వారి తల్లిదండ్రుల ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అంతకు ముందు ప్రాజెక్ట్ పరిధిలోని సూపర్ వైజర్లు, కార్యాలయ సిబ్బంది ఆమెకు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికి సత్కరించారు.

## వృద్ధులకు అన్నదానం

**వేంపల్లె :** ఏపీ మార్క్‌ఫెడ్ డైరెక్టర్ వంగల శశిభూషణ్‌రెడ్డి జన్మదిన వేడుకలను బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గాలిహరిప్రసాద్ ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. బుధవారం స్థానిక రాజీవ్‌నగర్ కాలనీలో ఉన్న అమ్మ అనాథ ఆశ్రమంలో అనాథ వృద్ధుల మధ్య కేక్ కట్ చేసి అన్న వితరణతోపాటు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకులు వెంకటసుబ్బయ్య, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

## రేపు ప్రముఖ వైద్య నిపుణుల రాక

**పులివెందుల :** పట్టణంలోని స్థానిక భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(గంగిరెడ్డి ఆసుపత్రి)లో శుక్రవారం ప్రముఖ వైద్య నిపుణులు రానున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. చర్మవ్యాధుల ప్రముఖ వైద్య నిపుణులు డాక్టర్ సోరియాసిస్, తామర, గజ్జి, ఫంగస్ ఇన్‌ఫెక్షన్, మొటిమలు, బెదులు, దద్దుర్లు, చుండ్రు తదితర చర్మ వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించనున్నారు. చెవి, ముక్కు, గొంతు వ్యాధుల శస్త్ర చికిత్స వైద్య నిపుణులు డాక్టర్ చెవిలో చీము కారుట, చెవి నొప్పి, చెవిలో శబ్దములు, చెవిలో కర్ణబేరికి రంధ్రం, చెవిటి మిషన్లు అమర్చడం, చెవిలో బలపాలు, పూసలు తీయుట, ముక్కు దూలం సరిచేయుట, అలర్జీ, సైనుసైటిస్, ముక్కులో రక్తం కారుటకు, ముక్కులో బలపాలు, పూసలు తీయుట, ముక్కులో గడ్డలకు, ఎండోస్కోపి సైనస్ సర్జరీ, గొంతులో గడ్డలకు శస్త్ర చికిత్స, స్వర పేటికలో లోపాలకు చికిత్స, గొంతులో ఇరుక్కుపోయిన చేప ముల్లులు, నాణేలు తీయుట, గొంతులో ఇన్‌ఫెక్షన్‌కు మాటలు రానివారికి చికిత్స, తలనొప్పి, తల తిరుగుట చికిత్స, చెవి, ముక్కు, గొంతునకు సంబంధించిన అనేక సమస్యలకు వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. ఈ అవకాశాన్ని పులివెందుల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9963170177, 08568286189 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

## వైభవంగా భీమేశ్వరస్వామి తిరునాల

**పెండ్లిమర్రి :** మండలంలోని వేలూరుపాడు గ్రామ సమీపంలో వెలసిన శ్రీభీమేశ్వరస్వామి తిరునాల ఉత్సవాలు రెండవ రోజు బుధవారం వైభవంగా జరిగాయి. ఉదయం స్వామివారికి అభిషేకాలకరణ, పంచామృతాభిషకం వంటి కార్యక్రమాలు వేదపండితుల ఆధ్వర్యంలో నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. ఉదయం 09.50గంటల నుంచి 12.00 గంటల వరకు శివ పార్వతుల కల్యాణం కన్నుల పండువగా జరిగింది. కల్యాణాన్ని తిలకించడానికి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి కల్యాణాన్ని కన్నులారా తిలకించారు. భక్తులకు ఆలయ అవరణలో దాతలు సహకారంతో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.


వేలూరు పాడులో శివ పార్వతులకు కల్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు

సాయంత్రం ఎద్దులచే బండలాగుడు పోటీలు నిర్వహించారు. పోటీలు రసవత్తరంగా సాగాయి. పోటీల్లో గెలుపొందిన ఎద్దుల యాజమానులకు ఆలయ కార్యనిర్వాహకులు బహుమతులు అందజేశారు.

## దివ్యాంగులకు గృహోపకరణాల పంపిణీ

**పులివెందుల :** అంధ బంధు డాక్టర్ వైఎస్ పురుషోత్తమరెడ్డి చిన్నకుమారుడు మైఖేల్ సత్యానందరెడ్డి చిన్నవయసులోనే మరణించడంతో ఆయన మధురజ్ఞాపకాలు చిరస్మరణీయంగా నిలిచిపోతాయని విశ్రాంత చీఫ్ ఇంజనీర్ ఫిలిప్ తెలిపారు. బుధవారం నిర్వహించిన ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. దివంగత డాక్టర్ వైఎస్ పురుషోత్తమరెడ్డి కుటుంబ సభ్యులు మైకేల్ స్మారకార్థం అవయవాలులేని దివ్యాంగులకు సేవాకార్యక్రమం చేపట్టడం అభినందనీయమన్నారు. మైకేల్ ద్వితీయ వర్ధంతిని పురస్కరించుకుని పురుషోత్తమరెడ్డి పెద్ద కుమారుడు డాక్టర్ సత్యానందరెడ్డి ఆధ్వర్యంలో పట్టణంలోని ముద్దనూరు రోడ్డులోని వికలాంగుల కమ్యూనిటీ భవనంలో ఏర్పాటు చేసిన సంస్మరణ సభలో ఫిలిప్, బ్రదర్ రఘుకర్, తదితరుల చేతుల మీదుగా 30 మంది దివ్యాంగులకు గృహోపకరణాలతోపాటు స్వీట్లు, పండ్లు అందజేశారు. ఈ సందర్భంగా ఏపీ దివ్యాంగుల నెట్‌వర్క్ రాష్ట్ర అధ్యక్షుడు ఇరికిరెడ్డి రఘునాథరెడ్డి వారికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బ్రదర్ రఘుకర్, వికలాంగుల నెట్‌వర్క్ రాష్ట్ర కార్యదర్శి సునీల్, వాల్మీకి సంఘం నాయకులు అంబకపల్లె బాలుడు, బాలిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


దివ్యాంగులకు గృహోపకరణాలను అందిస్తున్న డాక్టర్ సత్యానందరెడ్డి, ఫిలిప్, తదితరులు

## పరిసరాల పరిశుభ్రతతోనే మలేరియా నివారణ


మల్లేల గ్రామంలో మలేరియా వ్యాధి నిర్మూలన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య, ఆరోగ్య సిబ్బంది

**తొండూరు :** మురికి నీటిని, చెత్తా చెదారాలను తొలగించుకుని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే మలేరియా వ్యాధి నివారణ సాధ్యమని డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ మల్లయ్య తెలిపారు. బుధవారం మండలంలోని మల్లేల గ్రామంలో ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ సిబ్బంది ఆధ్వర్యంలో మలేరియా మాసోత్సవ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లయ్య మాట్లాడుతూ ప్రాణాంత మలేరియా వ్యాధి నుండి రక్షించుకోవడం మన కర్తవ్యమన్నారు. మలేరియా లేని గ్రామమే మన లక్ష్యమన్నారు. దోమల నివారణకు డ్రై డే ఫ్రైడే పాటించడం, దోమ తెరలు వాడటం తదితర కార్యక్రమాలు చేపట్టాలన్నారు. అనంతరం మల్లేల గ్రామంలో మలేరియా వ్యాధి నివారణపై ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీహెచ్ఓ సోమేశ్వరి, హెల్త్ అసిస్టెంట్ సతీష్‌కుమార్, ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఘనంగా ఏరువాక పౌర్ణమి వేడుకలు

**చక్రాయపేట :** ప్రకృతి వ్యవసాయం వారి ఆధ్వర్యంలో బుధవారం మండలంలోని చిలేకాంపల్లెలో ఏరువాక పౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయ జిల్లా అధికారుల ఆధ్వర్యంలో లక్ష్మీదేవి మహిళా రైతు పొలంలో నవధాన్యాల గింజలను విత్తన శుద్ధి చేయించి ఘణ జీవామృతం చేయించారు. రైతుల ప్రకృతి వ్యవసాయ ద్వారా తక్కువ ఖర్చుతో అధిక లాభాలను పొందవచ్చని రైతులకు సూచించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ జిల్లా అధికారి ప్రవీణ్ కుమార్, మండల వ్యవసాయ అధికారి నవంత్‌బాబు, వ్యవసాయ అధికారి ప్రతాప్, మాస్టర్ ట్రైనర్ నరసింహారెడ్డి సిబ్బంది, రైతులు పాల్గొన్నారు

**జమ్మలమడుగు :** పట్టణ పరిధిలోని రామిరెడ్డిపల్లెలో ఏరువాక పౌర్ణమి సందర్భంగా గ్రామంలో ఉత్సవాలను నిర్వహించారు. బుధవారం గ్రామంలో కన్నెలూరు గ్రామానికి చెందిన లక్ష్మీదేవి బృందం స్థానిక కోదండరామస్వామి ఆలయం ఎదుట కోలాటం నిర్వహించారు.


ఏరువాక పౌర్ణమి వేడుకల్లో నవధాన్యాల పంటను వేయిస్తున్న అధికారులు

## దళిత రైతులకు న్యాయం చేయండి


తెగిన విద్యుత్ తీగను చూపిస్తున్న బాధిత రైతు మనోహర్

**కమలాపురం :** పట్టణ పరిధిలోని జడ్‌హెచ్‌డీసీ భూముల్లో నిత్యం వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్న దళిత రైతులైన తమకు న్యాయం చేయాలని బాధిత రైతులు నరసయ్య, మనోహర్, జయమ్మ, సాలయ్య, ఆంథోని తదితరులు కోరుతున్నారు. తాము పంటల సాగు కోసం ఏర్పాటు చేసుకున్న విద్యుత్ లైన్లకు సంబంధించిన విద్యుత్ వైర్లు చోరికి గురవుతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల జరిగిన వరుస దొంగతనాల నేపథ్యంలో ప్రతి మీటరు నుంచి విద్యుత్ వైర్లు తెంచి తీసుకెళ్తున్నారని వారు ఆరోపించారు. దీంతో విద్యుత్ సరఫరా ఆగిపోతోందని, తద్వారా పంటలు ఎండిపోతున్నాయని ఆందోళన చెందుతున్నారు. తీరా పంటలు చేతికొచ్చే సమయంలో ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయన్నారు. అధికారులు స్పందించి తమ పొలాలకు రక్షణ కల్పించాలని బాధిత రైతులు కోరుతున్నారు.

## మనిషి మనుగడకు యోగా ఎంతో అవసరం

**పులివెందుల టౌన్ :** మనిషి మనుగడకు యోగా ఎంతో అవసరమని యోగా గురువు వెంకట్రామిరెడ్డి తెలిపారు. 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవంలో భాగంగా మున్సిపల్ కమిషనర్ రాముడు ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్ కార్యాలయ ఆవరణంలో బుధవారం సాయంత్రం ఉచిత యోగా శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా యోగా గురువు వెంకట్రామిరెడ్డి సిబ్బందితో యోగాసనాలు వేయించారు. కార్యక్రమంలో మున్సిపల్, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

## నూనె గింజల సాగులో మెలకువలు తప్పనిసరి

**చక్రాయపేట :** నూనెగింజల సాగులో రైతులు తగు మెలకువలు పాటించాలని కెవీకే శాస్త్ర వేత్తలు తెలిపారు. ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ఆదేశాల మేరకు బుధవారం మండలంలోని సురభి, కుప్పం గ్రామాల్లో వికసిత కృషి సంకల్ప అభియాన్‌పై అవగాహణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు నూతన సాంకేతికత మరియు ప్రభుత్వ పథకాలపై సమాచారాన్ని రైతులకు వివరించారు. అనంతరం నూనె గింజల్లో నూతన వంగడాలు వేరు శనగ, నువ్వులు సాగు తదితర పంటల యాజమాన్య పద్ధతులను వివరిం చారు. కార్యక్రమంలో నూనె గింజల పరిశోధన కేంద్ర శాస్త్రవేత్త డాక్టర్ దినేష్ కుమార్, కేవీకే శాస్త్రవేత్తలు మానస(ఉద్యాన శాఖ)మాధురి (తెగుళ్లవిభాగం), మహేష్‌బాబు(విస్తరణ), గిరీష్‌కుమార్(సూక్ష్మజీవశాస్త్రం), ప్రకృతి వ్యవసాయ జిల్లా అధికారి ప్రవీణ్‌కుమార్, మండల వ్యవసాయ అధికారి నవంత్‌బాబు రైతులు పాల్గొన్నారు.


రైతులను ఉద్దేశించి మాట్లాడుతున్న నూనెగింజల పరిశోధన కేంద్ర శాస్త్రవేత్త దినేష్‌కుమార్

## మూలవిరాట్ దర్శనం కల్పించాలని వినతి

**చక్రాయపేట :** గండి వీరాంజనేయస్వామి మూల విరాట్ దర్శన భాగ్యాన్ని శ్రావణ మాసానికి భక్తులకు కల్పించేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ రాష్ట్ర ముఖ్యమంత్రితో పాటు జిల్లా కలెక్టర్‌కు ఫ్యాక్స్ ద్వారా వినతిపత్రం పంపినట్లు జడ్పీటీసీ సభ్యుడు శివప్రసాద్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గండి ఆలయ పునఃనిర్మాణం పనులు 95 శాతం మేర పూర్తయ్యాయని తెలిపారు. అయితే స్వామి వారి మూలవిరాట్ దర్శనం భక్తులకు కల్పించడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నట్లు తెలిపారు. శ్రావణ మాసంలో సుమారు 10 లక్షల మంది భక్తులు స్వామిని దర్శించుకుంటారన్నారు. ఇప్పటికే మూల విరాట్ దర్శనం లేక భక్తులు మనోభావాలు దెబ్బతింటున్నాయన్నారు. చెక్కతో చేసిన విగ్రహానికి పూజలు చేయకూడదని పీఠాధి పతులు తెలిపారన్నారు. శ్రావణ మాసం నాటికి మూల విరాట్ దర్శన భా గ్యం భక్తులకు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు.

## షైనింగ్ స్టార్ అవార్డు అందుకున్న విద్యార్థులు

**వేంపల్లె :** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిభావంతులైన విద్యార్థులు అందించే షైనింగ్ స్టార్ అవార్డును స్వామి వివేకానంద పాఠశాల విద్యార్థులు జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా అందుకున్నట్లు పాఠశాల కరస్పాండెంట్ రామాంజనేయరెడ్డి తెలిపారు. కడప పట్టణంలో జరిగిన అవార్డుల ప్రధానోత్సవంలో షైనింగ్ స్టార్ పేరుతో తమ పాఠశాలకు చెందిన వినయ్, సుకీర్తన అనే విద్యార్థులు ప్రశంసా పత్రంతో పాటు ఒక్కొకరికి రూ.20వేల నగదును కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి అందించినట్లు తెలిపారు. ఉపాధ్యాయులు ఇచ్చిన చక్కటి బోధన ద్వారా విజయం సాధించారన్నారు. భవిష్యత్తులో ఇలాంటి విజయాలు ఎన్నో సాధిస్తామని విద్యార్థులు తెలిపారు. అనంతరం అవార్డులు పొందిన విద్యార్థులను కరస్పాండెంట్ రామాంజనేయరెడ్డి అభినందించారు.


కలెక్టర్ చేతుల మీదుగా అవార్డులు అందుకుంటున్న స్వామి వివేకానంద విద్యార్థిని, కరస్పాండెంట్

## భక్తి శ్రద్ధలతో పౌర్ణమి వేడుకలు


సంగాలపల్లె గోశాలలో గోమాతలకు పూజలు నిర్వహిస్తున్న భక్తులు

**వీరపునాయునిపల్లె :** ఎస్.పాలగిని క్రాస్ వద్ద వెలసిన కాశిరెడ్డినాయ ఆలయం, సంగాలపల్లెలో వెలసిన గోశాలలో బుధవారం భక్తి శ్రద్ధలతో పౌర్ణమి వేడుకలను నిర్వహించారు. ఉదయం 5 గంటల నుంచి కాశినాయన ఆలయంలోని మూల మూర్తితో పాటు ఉత్సవ మూర్తికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. మండలంలోని పలు గ్రామాల ప్రజలు స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి 8 గంటలకు కాశినాయన ఉత్సవ మూర్తిని ఆలయం చుట్టూ ఊరేగింపు చేపట్టడంతో పాటు అలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కోలాటం భక్తులను ఎంతగానో ఆకట్టుకొంది. ఆలయ నిర్వాహకుడు లక్ష్మిరెడ్డి ఉదయం 11 గంటల నుంచి రాత్రి వరకు అన్నదానం ఏర్పాటు చేశారు. అలాగే సంగాలపల్లెలోని శ్రీశివకృష్ణ గోశాలలో పౌర్ణమి సందర్భంగా గోమాతలకు ప్రత్యేక పూజలు నిర్వహిండంతో పాటు ప్రాంగణంలోని కృష్ణాలయంలో భాగతపఠణం, గీతా పారాయణ, తాళాల భజన కార్యక్రమం చేపట్టారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. కార్యక్రమాల్లో పాల్గొన్న భక్తులకు గోశాల నిర్వాహకుడు కల్లూరు రాజశేఖర్ రెడ్డి అన్నదాన సౌకర్యం కల్పించారు.

**కోన గవేశ్వరాలయంలో పౌర్ణమి పూజలు**

**పులివెందుల రూరల్ :** మండలంలోని మోట్నూతల పల్లె గ్రామ సమీపంలో వెలసిన శ్రీకోనగవేశ్వర స్వామి ఆలయంలో బుధవారం పౌర్ణమి పూజలు నిర్వహించారు. ఆలయంలో దాతలు, భక్తుల సహకారంతో ప్రతి ఏడాది ఎరువాక పౌర్ణమి రోజున స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు నిర్వహించారు. ప్రత్యేక అలంకరణలో ఉన్న స్వామివారిని భక్తులు దర్శించుకుని కాయ కర్పూరాలు సమర్పించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

**లింగాలలో..**


ప్రత్యేక అలంకరణలో శ్రీకాశిరెడ్డినాయన విగ్రహం

**లింగాల :** స్థానిక వనంబావి శివాలయం వద్ద వెలసిన అవధూత శ్రీ కాశిరెడ్డినాయన ఆలయంలో బుధవారం పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రతినెలా పౌర్ణమి రోజున శ్రీకాశిరెడ్డినాయన విగ్రహానికి అర్చనలు, అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక అలంకరణతో వేడుకలను నిర్వహించడం ఆనవాయితీగా సాగుతోంది. వేడుకల సందర్భంగా తాళాల భజన, చెక్కభజన కార్యక్రమాలను నిర్వహించారు. ప్రత్యేక అలంకరణలో ఉన్న స్వామివారిని భక్తులు దర్శించుకుని కాయ కర్పూరాలు సమర్పించి తీర్థ ప్రసాదాలను అందుకున్నారు. అనంతరం భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అలాగే కర్ణపాపాయపల్లె గ్రామంలోని భూలింగేశ్వరస్వామి ఆలయంలో ఏరువాక పౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో లింగాల, లోపట్నూతల, గుణకణపల్లె, రామట్లపల్లె, తదితర గ్రామాల భక్తులు పాల్గొన్నారు.